# వస్తు, సేవల పన్ను ఆవిర్భావము - ఆచరణ

ప్రపంచంలో తొలిసారిగా వస్తు సేవల పన్నును ఫ్రాన్స్ లో 1954 లో ప్రవేశపెట్టడం జరిగింది. ప్రస్తుతం 160 దేశాలు దీనిని అమలు చేస్తున్నాయి. ప్రపంచమంతటా ఇంచుమించు ఒకే GST విధానాన్ని అమలు చేస్తున్నారు. వస్తు, సేవల పన్ను (GST) అన్నది భారతదేశంలో అనేక విడివిడి పన్నులను ఒకే పన్నులో విలీనం చేసేలా వచ్చిన పన్నుల వ్యవస్థ. 122వ రాజ్యాంగ సవరణ బిల్లుగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జిఎస్‌టి బిల్లు 2016 ఆగస్టు 8న లోక్‌సభలో, ఆగస్టు 3న రాజ్యసభలో ఆమోదం పొందింది. సెప్టెంబరు 8న రాష్ట్రపతి ఆమోదం పొంది 101వ రాజ్యాంగ సవరణ చట్టంగా ఏర్పడింది.

జిఎస్‌టి మన దేశం లో 2017 జూలై 1 నుండి అమలులోనికి వచ్చింది. 'ఒకే దేశం - ఒకే పన్ను' ప్రాతిపదికన వస్తు సేవల పన్ను రూపకల్పన జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకూ వసూలు చేస్తున్న అనేక రకాల పన్నుల స్థానంలో ఒకే పన్ను అమల్లోకి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పన్ను వసూలు చేస్తాయి. ఒకే పన్ను విధానంవల్ల రాష్ట్రాల మధ్య అంతరం తొలగిపోతుంది.

జీఎస్టీ అమలుతో దేశం అంతటా ఏకరీతి పన్నుల విధానం అమల్లోకి వస్తుంది. అంటే వస్తు తయారీ, విక్రయం, వినిమయం, దిగుమతులు, సేవలకు సంబంధించి కేంద్ర, రాష్ట్రాలతోపాటు స్థానిక మండళ్లు విధించే పరోక్ష పన్నులన్నీ ఒకే గొడుగు కిందికి వస్తాయి. ఒకే వస్తువుపై అనేకసార్లు పన్ను విధించే విధానానికి స్వస్తిపలికి దేశమంతటా ఏకరూప పన్ను అమల్లోకి వచ్చింది .

జీఎస్టీ చట్టంలో ద్వంద్వ జీఎస్టీ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. కేంద్ర జీఎస్టీని(CGST) కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర జీఎస్టీని(SGST) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తాయి. సమీకృత జీఎస్టీని(IGST) కేంద్ర ప్రభుత్వమే అమలు చేస్తుంది. ఒక వస్తువు లేదా సేవ అందించే ప్రదేశం, దాని వినియోగదారుడి ప్రదేశం ఒకే రాష్ట్రంలో ఉంటే దానిపై జీఎస్టీ (CGST & SGST) వర్తిస్తుంది.

**ప్రస్తుతానికి మద్యం, పెట్రోలియం ఉత్పత్తులు (ముడి చమురు, పెట్రోలు, డీజిల్, సహజ వాయువు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్- ఏటీఎఫ్), విద్యుత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేదు. వీటిని ఎప్పుడు తీసుకురావాలనే అంశంపై జీఎస్టీ కౌన్సిల్ భవిష్యత్తులో నిర్ణయం తీసుకోవచ్చు**

**GST మండలి పాత్ర:** వస్తు సేవల పన్ను చట్టంలోనే దాని పరిపాలనకు వస్తు సేవల పన్ను మండలి అనే ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి కేంద్ర ఆర్థిక మంత్రి మండలి చైర్మన్ గా ఉంటారు. కేంద్ర రెవిన్యూ సహాయమంత్రి, రాష్ట్రాల ఆర్థిక/పన్నుల శాఖ మంతులతో GST మండలి ఏర్పాటవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ దిగువ అంశాలపై మండలి సిఫారసులు చేస్తుంది.

1. GST పరిధిలో విలీనమయ్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు విధించే పన్నులు సెస్ లు, సర్ ఛార్జీలు.
2. GST పరిధిలోకి వచ్చే లేక మినహాయింపు పొందే సరుకులు, సేవలు.
3. పెట్రోలియం, ముడిచమురు, డీజిల్, పెట్రోల్, సహజవాయువు, విమానాలలో ఉపయోగించే ఇందనంపై GST విధించే తేదీ.
4. నమూనా GST చట్టాలు, సుంకాలకు సంబంధించిన సూత్రాలు, IGST పంపిణీ, సరఫరా జరిగే ప్రాంతంలో పాటించాల్సిన సూత్రాలు.
5. GST నుంచి మినహాయింపు ఇవ్వాల్సిన టర్నోవర్ పరిమితి.
6. పన్ను రేట్లు, GST బాండ్లతో కూడిన మౌళిక రేట్లతో సహా.
7. ప్రకృతి విపత్తులు లేదా ఉత్పాతాల సందర్భంగా నిర్ణీత కాలవ్యవధిలో అదనపు వనరుల సేకరణకు విధించే ప్రత్యేక రేటు లేదా రేట్లు.
8. ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖాండ్ రాష్ట్రాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు.
9. కౌన్సిల్ అభీష్టం మేరకు చేపట్టే మరే ఇతర అంశాలు.

GST మండలిని నడిపించే మార్గదర్శక సూత్రం: కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య, రాష్ట్రాల మధ్య GST కి సంబంధించి సంతులనం పాటించడం GST మండలి యంత్రాంగం బాధ్యతగా ఉంటుంది. GST వ్యవస్థలో సంతులన నిర్మాణం ఏర్పరచాల్సిన ఆవశ్యకత, సరుకులు, సేవలకు జాతీయ మార్కెట్ ను సమన్వయపరచడం GST మండలి నిర్వహించే వివిధ విధుల లక్ష్యంగా ఉంటుందని రాజ్యాంగలోని 101 సవరణ సూచిస్తున్నది.

**GST మండలి నిర్ణయాలు:** GST మండలి ప్రతి నిర్ణయం సమావేశానికి హాజరై ఓటింగ్ లో పాల్గొన్న సభ్యుల వెయిటెడ్ ఓట్లలో 3/4 శాతం మెజారిటీతో జరగాలని రాజ్యాంగలోని 101 సవరణ సూచిస్తున్నది. కేంద్రప్రభుత్వం ఓటు వెయిటేజీ మొత్తం పడిన ఓట్లలో 1/3 వంతు ఉంటుంది. అలాగే మొత్తం అన్ని రాష్ట్రాల ఓటింగ్ వెయిటేజి ఆ సమావేశలో పడిన మొత్తం ఓట్ల విలువలో 2/3 వంతు ఉంటుంది. మొత్తం GST మండలి సభ్యులలో సగం మంది హాజరైన పక్షంలో సమావేశానికి కోరం ఉన్నట్లుగా భావిస్తారు.

GST క్రింద విధించాల్సిన పన్ను రేట్ల నిర్ణయాలు: కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా నిర్ణయించే రేట్ల ప్రకారం GST వసూలు చేస్తారు. GST మండలి సిఫారసుల మేరకు ఈ రేట్లను నోటిపై చేస్తారు.

జీఎస్టీ కౌన్సిల్ ఛైర్మన్ గా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వస్తు సేవల పన్నును పరిపాలిస్తారు. జీఎస్టీ అన్నది భారతదేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పరోక్ష పన్నుల బదులు వస్తువులు, సేవల తయారీ, అమ్మకం, వినియోగాలపై విధించనున్న సమగ్రమైన పరోక్ష పన్ను.

జీఎస్టీ కౌన్సిల్ ఐదు  రకాలైన పన్ను శ్లాబులను ఆమోదించింది. దీని ప్రకారం 0, 5, 12, 18, 28 శాతం పన్ను రేట్లు అమలు కాబోతున్నాయి. ఒక్కో పన్ను శ్లాబు కింద వచ్చే వస్తువులు, సేవలు ఏమిటనేది ప్రభుత్వం నిర్ణయించింది. బంగారం, బంగారు ఆభరణాలకు మాత్రం 3 శాతం ప్రత్యేక జీఎస్టీ రేటు ప్రతిపాదించారు.

## జీఎస్టీ తీసుకురావడానికి ఉద్దేశం..

అన్ని రకాల డైరెక్ట్, ఇన్ డైరెక్ట్(ప్రత్యక్ష, పరోక్ష పన్నుల) ట్యాక్స్ లను కలిపేందుకు
కేంద్రం, రాష్ట్రం వేరే వేరుగా కాకుండా ఒకటే ట్యాక్స్ వసూల్ చెయ్యడానికి
ట్యాక్స్-జిడిపి శాతాన్ని పెంచడం(పన్నుల స్థాయిని జిడిపికి తగ్గట్టుగా పెంచడానికి)
ట్యాక్స్ ఎగ్గొట్టడం,అవినీతిని దూరం చెయ్యడానికి

## వస్తు సేవల పన్ను చట్టం, 2017 ధ్యేయాలు:

1. **బహుళ పన్నుల తగ్గింపు, ద్వంద్వ పన్ను, పన్ను మీద పన్నులను తీసివేయడం:** వస్తు సేవల పన్ను అనేది వినియోగం ఆధారంగా విధించబడుతుంది. వస్తువు విలువ నిర్ణయం ప్రతి దశలోను పన్ను కట్టే విధానాన్ని లేదా ద్వంద్వ పన్నును తీసివేయడం జరుతుంది. ప్రతి దశలోను పన్ను క్రెడిట్ ఇస్తారు.
2. **జాతీయ మార్కెట్:** ఒకే విధమైన పన్ను, పద్ధతుల ద్వారా జాతీయ మార్కెట్ సాధ్యమవుతుంది.
3. **వస్తు సేవల వ్యయంలో తగ్గుదల:** పన్ను మీద పన్ను కట్టే విధానాన్ని తొలగించడం వలన వినియోగదారులకు వస్తుసేవల వ్యయం తగ్గుతుంది.
4. **ఇన్ పుట్ పన్ను క్రెడిట్ మెకానిజం:** వస్తు సేవల పన్ను అంతకు ముందు దశలో చెల్లించిన పన్నుకు క్రెడిట్ సర్దుబాటు చేసుకునే వీలు కల్పిస్తుంది. దీని వలన ఉత్పత్తిదారులకు అవసరమయ్యే నిర్వహణా మూలధనం తక్కువ అవసరం అవుతుంది.
5. **సులభమైన పన్ను పద్ధతి:** దేశంలో ఉన్న సంక్లిష్టమైన పరోక్ష పన్ను విధానాన్ని, వివిధ రకాల పరోక్ష పన్నులను రద్దు చేసి, వీటి స్థానంలో ఒకే ఒక వస్తువు సేవల పన్నును తీసుకురావడం జరిగింది. ఈ వస్తు సేవల పన్నుల చట్టంలో పన్నుల విధింపు, మదింపు, చెల్లింపు మొదలైన వ్యవహారాలను ఒకే రకంగా చేయడం వలన  పన్ను చెల్లించే వ్యాపారస్తులకు ఎంతో సులభంగా ఉంటూ సమస్యలు లేకుండా చేస్తుంది.
6. **పన్ను పద్ధతిలో అంతా బహిర్గతమే:** వస్తు సేవల పన్ను విధానం మొత్తం ఆన్ లైన్ ద్వారానే జరుతుంది. దీని కోసం గాను కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను నెట్ వర్క్ (GSTN) ను తీసుకువచ్చింది. దీని వలన వస్తు సేవల పన్ను చట్టం క్రింద నమోదు, రిటర్న్, వాపసులు, పన్ను చెల్లింపులు మొదలైన అంశాలు చాలా సులభతర మవ్వడమే గాక, స్వయం చలన్ అంగా అమలవుతాయి. ఇన్ పుట్ పన్ను క్రెడిట్ కూడా సులభమవ్వడమే గాక, మొత్తంగా పారదర్శకత ఉంటుంది.